
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త



# రాష్ట్ర మంత్రి నాదెండ్ల ను కలిసిన జనసేన నగర అధ్యక్షులు సుజయ్



**నెల్లూరు, మార్చి 19 ప్రభాతవార్త-విద్య** రాష్ట్ర సచివాలయంలో బుధవారం రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్‌ని జనసేనపార్టీ నెల్లూరు నగర అధ్యక్షులు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జిల్లాలో పార్టీ పరిస్థితి బలోపేతానికి చేయాల్సిన కృషి అలాగే జనసేన ఆవిర్భావ సభ విజయ వంతం తదితర అంశాలనుచర్చించారు. అనంతరం దుగ్గిశెట్టి మంత్రి నాదెండ్లను శాలువాకప్పి, పుష్పగుచ్ఛాలు అందించిన సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆలియా, నాగరత్నం తదితరులు పాల్గొన్నారు .

# జిల్లాలో 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

- రైతుల ఖాతాలకు రూ. 43.39 కోట్లు నగదు జమ
- జాయింట్ కలెక్టర్ కార్తీక్



**నెల్లూరు కలెక్టరేట్, మార్చి 17, ప్రభాతవార్త** జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 20,023 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జాయింట్ కలెక్టర్ కొల్లాబతుల కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం 3537 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు జేసి చెప్పారు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ 24 గంటల నుంచి 48 గంటల్లోగా రైతుల ఖాతాలకు డబ్బులు జమ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇప్పటివరకు 43.39 కోట్ల రూపాయలు రైతులకు చెల్లించినట్లు జేసి తెలిపారు. రైతులందరూ కూడా దళారుల మాటలు విని తక్కువ ధరకు అమ్ముకోవద్దని సూచించారు. దళారులకు విక్రయిస్తే ధాన్యం డబ్బులు కూడా చాలా ఆలస్యంగా వస్తాయని, ప్రభుత్వానికి విక్రయిస్తే రెండు రోజుల్లోనే డబ్బులు జమవుతున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని, ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు.

# తెలంగాణ వక్ఫ్‌బోర్డు చైర్మన్‌తో అబ్దుల్ అజీజ్ భేటీ

- రూ.55కోట్లను త్వరితగతిన బదిలీ చేయండి



**నెల్లూరు, మార్చి 19, ప్రభాతవార్త -వైద్యం** హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఉన్న తెలంగాణ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేని తో ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన లో భాగంగా భారత ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ 2015 లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు వేర్వేరు వక్ఫ్‌బోర్డులు ఏర్పాటు చేయాలని కీలక నిర్ణయం తీసుకుందని అన్నారు. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందని, తెలంగాణ రాష్ట్ర వక్ఫ్‌బోర్డులో ఉన్న డిపాజిట్లు, పెట్టుబడులు, నగదు నిల్వలను ఆంధ్రప్రదేశ్ వక్ఫ్‌బోర్డు బదిలీ చేయాలని గెజిట్‌లో స్పష్టంగా పేర్కొందని తెలిపారు. ఆంధ్ర రాష్ట్రానికి రావాల్సిన కోట్ల రూపాయల నిధులు, రాష్ట్రానికి సంబంధించిన పాత రికార్డులు ఇప్పటి వరకు అప్పగించలేదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉందని, ఆంధ్ర రాష్ట్ర వక్ఫ్‌బోర్డు కు రావాల్సిన రూ.55,49,44,123 త్వరితగతిన బదిలీ చేయాలని కోరారు. అలాగే ఫైళ్లు, సర్వే పత్రాలు, జిల్లాల వారీగా గెజిట్లు, బోర్డు తీర్మాణాలు ప్రతులూ, పాత రికార్డులన్నీ తమకు అందజేయాలని కోరారు. దీనిపై తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. రంజాన్ పండుగ తర్వాత ఇరు రాష్ట్రాల వక్ఫ్‌బోర్డు చైర్మన్‌లు, బోర్డు సభ్యులు, అధికారులు కలిసి సమీక్షించి ప్రణాళిక రూపొందించి ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలకు పంపి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఇరువురు చైర్మన్‌లు నిర్ణయించారు.

# దేవరతిప్ప ప్రాంతంలో అక్రమంగా ఖనిజం తవ్వకాలు

- రెండు జేసీబీలను పట్టుకున్న అధికారులు



**సైదాపురం, మార్చి 19, ప్రభాతవార్త** మండల కేంద్రమైన సైదాపురంలో మైనింగ్ మాఫియా రెచ్చిపోతూ ఎక్కడపడితే అక్కడ ప్రభుత్వ భూముల్లో యధేచ్ఛగా తెల్లరాయి తవ్వకాలు, ఖనిజం రవాణా నిర్వహిస్తున్నారు. వీళ్ళని అడిగే వారు ఆపేవారు లేకపోవడంతో సాక్షాత్తు రెవెన్యూ కార్యాలయం కూతవేటు దూరంలో ఉన్న దేవరతిప్ప ప్రాంతంలో అక్రమంగా తెల్లరాయి తవ్వకాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో దేవరతిప్ప ప్రాంతంలో మంగళవారం రాత్రి కొంత మంది వ్యక్తులు జేసీబీలతో తెల్లరాయి వెలికితీస్తుండగా బుధవారం తెల్లవారుజామున రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి రెండు జేసీబీలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై కాంతికుమార్ మాట్లాడుతూ దేవరతిప్ప ప్రాంతంలో కొంత మంది వ్యక్తులు ఎటువంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూముల్లో జేసీబీ సహాయంతో అక్రమంగా ఖనిజం వెలికి తీస్తున్నారన్న సమాచారం రావడంతో రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించడం జరిగిందని, ఈ దాడుల్లో రెండు జేసీబీలను పట్టుకుని, తురక రాముతో పాటు మరో ఐదు మంది



వ్యక్తులను అదుపులోకి తీసుకోవడం జరిగిందని తెలిపారు.

అదుపులోకి తీసుకున్న ముద్దాయిలపై క్రిమినల్ కేసు నమోదు చేయడం జరిగిందని ఆయనఅన్నారు. మండలంలో ఎవరైనా ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా తెల్లరాయి తవ్వకాలు, ఖనిజ రవాణా నిర్వహిస్తే వారిపై కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

# సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, మార్చి19, ప్రభాతవార్త** : మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి బుధవారం సాయంత్రానికి 0 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 54.930 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్‌ఎఫ్‌సికి 350, ఎన్‌ఎఫ్‌సికి 400, పెన్నా డెల్టాకు 500, కండలేరు వరద కాలువకు200 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 97.192 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# ఎంఎస్‌ఎంఈ రుణాలతోనే ఆర్థిక పరిపుష్టి

- రుణాల మంజూరులో ప్రైవేటు బ్యాంకులు భాగస్వామ్యం కావాలి
- జాయింట్ కలెక్టర్ కె కార్తీక్



**నెల్లూరు కలెక్టరేట్, మార్చి 19, ప్రభాతవార్త** ఎంఎస్‌ఎంఈ రుణాలతో అన్ని రంగాల ఆర్థిక పరిపుష్టి సాధ్యమని, ఎంఎస్‌ఎంఈ రుణాల మంజూరులో ప్రైవేటు బ్యాంకర్లు తప్పనిసరిగా భాగస్వామ్యం కావాలని జాయింట్ కలెక్టర్ కె కార్తీక్ కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లాస్థాయి బ్యాంకర్ల సమితి సమావేశం జేసీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రైవేటు బ్యాంకర్లు లబ్ధిదారులకు రుణాల మంజూరులో బాగా వెనుకబడి వున్నారన్నారు. ప్రభుత్వరంగ బ్యాంకులతో పాటు ప్రైవేటు బ్యాంకర్లు కూడా ప్రభుత్వ కార్యక్రమాల అమలుకు పూర్తి సహాయ సహకారాలు అందించి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముద్ర యోజన, పిఎంఈజిపి, ఎంఎస్‌ఎంఈ రుణాల మంజూరులో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఎంఎస్‌ఎంఈ రుణాల మంజూరుతోనే ఆర్థిక స్వావలంబన, ఆర్థిక పరిపుష్టి సాధ్యమన్నారు. తద్వార అన్నిరంగాల్లో జిల్లా అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు విరివిగా రుణాలు ఇవ్వాలన్నారు. వ్యవసాయశాఖ, మత్స్య శాఖ, పశుసంవర్ధకశాఖల ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాలను ఆయా బ్యాంకులకు అధికారులు పంపి వున్నారని, ఈ రుణాల మంజూరులో అశ్రద్ధ తగదన్నారు. ఆయాశాఖలకు సంబంధించిన ఒక అధికారిని నోడల్ అధికారిగా నియమించి డిపార్టుమెంటు ద్వారా మంజూరయ్యే రుణాలకు సంబంధించి బ్యాంకులతో సమన్వయం చేసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎల్‌డిఎం, నోడల్ అధికారి సమన్వయంతో పనిచేసి బ్యాంకులతో సంప్రదించి లబ్ధిదారులకు రుణ మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. గ్రామాల్లో లబ్ధిదారులతో నిర్వహించే అవగాహన సదస్సులకు ఆయా శాఖల బ్యాంకు అధికారులు కూడా పాల్గొనాలని కోరారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నందున రైసుమిల్లర్లకు బ్యాంకు గ్యారెంటీలు త్వరగా మంజూరు చేయాలని బ్యాంకర్లకు జేసీ సూచించారు. బీసీ, మైనార్టీ కార్పొరేషన్ రుణాల మంజూరు ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలన్నారు. బ్యాంకర్లందరూ సమష్టిగా పనిచేసి రుణాలను సామాన్యులకు చేరువ చేయాలని ఆయన కోరారు. లీడ్ డిస్ట్రిక్ బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్ ప్రదీప్ మాట్లాడుతూ ఈ త్రైమాసికానికి సంబంధించి రుణాల మంజూరులో మంచి ఫలితాలు సాధించినట్లు చెప్పారు. 426413 మంది రైతులకు రూ.8558 కోట్ల పంట రుణాలు (96శాతం), 23513 మంది ఎంఎస్‌ఎంఈ లబ్ధిదారులకు 4095 కోట్లు (85శాతం), 646840 మంది రైతులకు మొత్తం వ్యవసాయ రుణాలు రూ. 13988 కోట్లు (99శాతం), ప్రాధాన్యత రంగానికి సంబంధించి 701481మంది లబ్ధిదారులకు రూ.18569 కోట్లు (92శాతం) రుణాలు అందించినట్లు వివరించారు. ఈ సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్ ప్రదీప్, నాబార్డు డిడిఎం బాబు, ఆర్‌బిఐ మేనేజర్ రాజేష్, పశుసంవర్ధక, మత్స్యశాఖ జెడిలు రమేష్‌నాయక్, నాగేశ్వరరావు, ఎపిఎంఐపి పిడి శ్రీనివాసులు, బీసీ కార్పొరేషన్ ఈడి నిర్మలాదేవి, మైనార్టీ కార్పొరేషన్ ఈడి హైపా ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

# దళారులను నమ్మి మోసపోవద్దు

- ప్రభుత్వానికి ధాన్యాన్ని అమ్మి మద్దతు ధర పొందండి
- అందుబాటులో 5 లక్షల గన్ని బ్యాగ్స్
- పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



**నెల్లూరు కలెక్టరేట్ మార్చి 19, ప్రభతవార్త** రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అమ్మి మద్దతు ధర పొందాలని రాష్ట్ర పౌర సరఫరాలు, ఆహారం, వినియోగ దారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదేండ్ల మనోహర్ రైతులకు సూచించారు. బుధవారం నెల్లూరు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన ఈరోజు అసెంబ్లీలోని మంత్రి ఛాంబర్ నందు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నెల్లూరు జిల్లాలో ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. నెల్లూరు జిల్లాలో గత రెండు సంవత్సరాలుగా ధాన్యం కొనుగోలు విషయంలో గత ప్రభుత్వం శ్రద్ధ చూపలేదని దీంతో రైతులు దళారులకు ధాన్యం అమ్మి మోసపోతున్న విషయం ప్రజా ప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి తక్కువ రేటు కు ధాన్యాన్ని అమ్మి మోసపోవద్ద అన్నారు. ఇప్పటికే జిల్లాలో 46 వరి కోతలు పూర్తయ్యాయన్నారు. పండించిన ధాన్యాన్ని రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అమ్మి 24 గంటలలోనే డబ్బు పొంద వచ్చ న్నారు. రైతులకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని భరోసానిచ్చారు. ధాన్యం కొనుగోలు విషయంలో జిల్లాలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఐదు లక్షల గన్ని బ్యాగులను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజా ప్రతినిధులు పర్యటించి, ఏమైనా ఇబ్బందులు ఉంటే పరిష్కరించుకునేందుకు చొరవ చూపాలన్నారు. రవాణా విషయంలో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు. అదేవిధంగా ప్రతి మిల్లు వద్ద రెవెన్యూ సిబ్బంది ఉండే విధంగా ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో సంఘం, కొవూరు ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు ముమ్మరంగా జరుగుతుందన్నారు. ధాన్యం కొనుగోలు జరిగిన 24 గంటల్లోనే రైతు ఖాతాలో నగదు జమ అవుతుందన్నారు. రైస్ మిల్లర్ అసోసియేషన్‌తో మాట్లాడి దళారుల ప్రమేయం తగ్గించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైతే రైతుకు ఇబ్బంది లేకుండా ప్రకాశం, బాపట్ల కందుకూరు తదితర ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, నెల్లూరు జిల్లా ఇన్చార్జి మంత్రి మహమ్మద్ ఫరూక్, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన రెడ్డి, కొవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి, కావలి ఎమ్మెల్యే కృష్ణా రెడ్డి, ఉదయగిరి ఎంఎల్ఏ కాకర్ల సురేష్‌లతో పాటు నెల్లూరు జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్, సివిల్ సప్లై అధికారులు ఉన్నారు.

# చైతన్య పాఠశాలకు తాళం..

- బిల్డింగుకు బకాయిలు చెల్లించని యాజమాన్యం
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు





**కోవూరు, మార్చి 19 ప్రభాతవార్త :** రాష్ట్రంలోనే ప్రముఖంగా పేరుగాంచిన శ్రీ చైతన్య విద్యా సంస్థలకు సంబంధించి కోవూరులో ఉన్న శ్రీ చైతన్య ఆంగ్ల మాద్యమ పాఠశాలకు బుధవారం బిల్డింగ్ యజమాని తనకు రూ. రూ. 36 లక్షల బకాయిలు ఉన్నాయనే నేపథ్యంలో దీనిని దృష్టిలో పెట్టుకుని పాఠశాలకు తాళం వేశారు. దీంతో బుధవారం పాఠశాలకు వచ్చిన చిన్నారులు ఇంటికి పోవాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్రస్థాయిలో ఆందోళన చెందుతున్నారు. తమ దగ్గర క్రమం తప్పకుండా ఫీజులు తీసుకుంటున్న యాజమాన్యం బిల్డింగ్ యజమానికి ఎందుకు నిధులు చెల్లించడం లేదో తమకు అర్థం కావడం లేదని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. బుధవారం పాఠశాలకు తాళం వేసే సమయంలో ఆ ప్రాంతంలో ప్రిన్సిపాల్ గానీ, డీన్ కానీ లేకపోవడం గమనార్హం. ఈ పాఠశాల ఉద్యోగులు మాత్రం తల్లిదండ్రులకు ఆడిటింగ్ జరుగుతుంది.

❖ **దీంతో ఈ రోజు పాఠశాలకు సెలవు ఇచ్చామని చెప్పడం కొసమెరుపు..** గత రెండు సంవత్సరాలుగా శ్రీ చైతన్య యాజమాన్యంకు చెబుతున్నా వారు మాత్రం రెంట్ విషయంలో జాప్యం చేస్తున్నారని బిల్డింగ్ యజమాని వినీత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు రూ. 36 లక్షల మేర ఈ రెంట్‌కు సంబంధించి బకాయిలు రావాల్సి ఉందని, విధి లేని పరిస్థితిలో మాత్రమే తాళాలు వేశామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. సమాచారం తెలుసుకున్న కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ పాఠశాల ప్రాంతానికి చేరుకుని అక్కడ నుంచి శ్రీ చైతన్య ఉద్యోగులతో మాట్లాడారు. ఎన్ని సార్లు ఫోన్ చేసినా ప్రిన్సిపాల్ గానీ, డీన్ గానీ సకాలంలో అందుబాటులోకి రాకపోవడం గమనార్హం. తొలిసారిగా ఒక ప్రముఖ గుర్తింపు పొందిన ఈ పాఠశాలకు బిల్డింగ్ యాజమాని తాళాలు వేసిన సంఘటన కోవూరు పరిసరాల్లో దావాణంలా వ్యాపించింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు తాము వేలకు వేలు ఫీజులు చెల్లించామని, తాళాలు వేస్తే తమ పరిస్థితి ఏమిటని ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్న సమయంలో ఈ పరిస్థితి జరగడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అసలు పాఠశాల తెరుస్తారా లేదా అనే డోలాయమానంలో కూడా తల్లిదండ్రులు ఉండడం గమనార్హం.

# స్వచ్ఛ సర్వేక్షణ్ లో ఉత్తమ ర్యాంకుకై కృషి చేయండి

- కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్,మార్చి 19 ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా ఉన్నత మున్సిపాలిటీల ఎంపికలో భాగంగా స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఉత్తమ ర్యాంకు సాధించేందుకు సిబ్బంది అందరూ కృషి చేయాలని కమిషనర్ సూర్య తేజ పిలుపునిచ్చారు. నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో పారిశుధ్య విభాగం వారాంతపు సమీక్షలో భాగంగా శానిటేషన్ అధికారులు, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్ అభిప్రాయ సేకరణ కోసం నగరంలో ఓట్ ఫర్ వెబ్, ఓట్ ఫర్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను నగరవ్యాప్తంగా ప్రచారం చేస్తున్నామని తెలిపారు. నగర పాలక సంస్థ పరిధిలోని ప్రజలంతా స్వచ్ఛ సర్వేక్షన్ సర్వేలో పాల్గొని, నిర్దేశించిన 10 ప్రశ్నలకు తమ అభిప్రాయాలను వెలిబుచ్చాలని కమిషనర్ కోరారు. డ్రైను కాలువలలో మురుగు నీరు సాఫీగా ప్రవహించేందుకు అవసరమైన చర్యలను సచివాలయాల వారీగా నివేదికలు అందించాలని సూచించారు. డివిజన్ల పరిధిలో డ్రైను కాలువల్లో మురుగు నిల్వ ఉండకుండా క్రమం తప్పకుండా పూడికతీత పనులను చేపట్టాలని ఆదేశించారు. అవసరమైన చోట్ల ర్యాంపులు, కల్వర్ట్ లు, సివిల్ పనులు, మెష్ ఏర్పాటు, లెవెలింగ్ పనులకు సంభందించిన యాక్షన్ ప్లాన్ చేపట్టి డ్రైను కాలువల మురుగు ప్రవాహానికి అంతరాయం లేకుండా పర్యవేక్షించాలని కమిషనర్ సూచించారు. నిషేధిత సింగల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించి దైనందిన జీవితంలో ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వీధి వ్యాపారాలు, దుకాణాల నిర్వాహకులు, హోటళ్ళు, రెస్టారెంట్లలో ప్లాస్టిక్ నిషేదించినట్లు తెలియజేసి, వాడకాన్ని నిరోధించాలని తెలిపారు. మెప్మా ఆధ్వర్యంలో నార, గుడ్డ సంచుల వినియోగం పై ప్రజలకు అవగాహన కల్పించి, పర్యావరణ హితమైన ఉత్పత్తుల వినియోగంతో చెత్తను తగ్గించవచ్చని పౌరులలో చైతన్యం కల్పించాలని సూచించారు. వాటర్ పాకెట్లను తయారు చేస్తున్న కేంద్రాలను గుర్తించి వాటిని వెంటనే సీజ్ చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని ఖాళీ స్థలాల యజమానులకు అవగాహన కల్పించి వారి స్థలాలను శుభ్రం చేయించే కార్యక్రమం మంచి ఫలితాలను ఇస్తోందని సిబ్బందిని కమిషనర్ అభినందనలు తెలిపారు. ఇతర స్థలాల యజమానులు కూడా ఈ విధానాన్ని ఆచరించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ నందన్, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య, అమృత్ పథకం పి.డి. మాధురి, సూపెరెంటెండెంట్ సులోచన, శానిటరీ సూపర్వైజర్లు,ఇన్స్పెక్టర్లు, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, మేస్త్రీలు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఫంక్షన్లలో నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తే భారీ జరిమానాలు తప్పవు

- కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్,మార్చి 19 ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో జరిగే వివాహ శుభకార్యాలు, పబ్లిక్ మీటింగులు, ఫంక్షన్ హాళ్లు, హోటళ్ళు, వైన్ షాపులు, రెస్టారెంట్లలో ఏర్పాటు చేసే ఆహార పదార్థాల సరఫరాలో నిషేధిత సింగల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులను వినియోగిస్తే భారీ జరిమానాలు తప్పవని కమిషనర్ సూర్య తేజ హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో వివరాలను తెలియజేస్తూ నగరవ్యాప్తంగా ఉన్న క్యాటరింగ్ నిర్వాహకులు, వెడ్డింగ్ ప్లానర్స్, ఇతర ఫంక్షన్ హాళ్ళ నిర్వాహకులు కార్యక్రమాల్లో భాగంగా వాటర్ బబుల్స్, డిస్పోజల్ ప్లాస్టిక్ గ్లాసులు, స్పూనులు, ప్లేట్లు, కవర్లు తదితర 120 మైక్రోన్లకన్నా తక్కువ స్థాయి గల సింగల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులను వినియోగించినట్లు తమ దృష్టికి వస్తే నిర్వాహకులకు లక్ష రూపాయల వరకు భారీ జరిమానా విధిస్తామని తెలియజేశారు

## భారతదేశానికి గర్వకారణం విలియమ్స్ సునీత



**కలువాయి మార్చి 19 ప్రభాతవార్త :** భారతదేశానికి గర్వకారణంగా నిలిచిన విలియమ్స్ సునీతాకు కలువాయి హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు అభినందనలు తెలిపారు. అంతరిక్ష కేంద్ర నుండి బయలు దేరిన క్రూడ్రాగన్ వ్యోమ నౌక బుధవారం తెల్లవారు జామున ఫ్లోరిడా తీరంలో సురక్షితంగా దిగింది.భారత సంతతికి సునీత విలియమ్స్ గర్వకారణం అయింది. దాదాపు 9 నెలలు పాటు అంతరిక్షంలోనే ఉండిపోయి ఆస్ట్రోనాట్‌లతో కలిసి సురక్షితంగా పుడమిని చేరిన మరో ఇద్దరికి ఈ సందర్భంగా దేశం అభినందలు తెలపడం గర్వకారణమని వారు తెలిపారు.ప్రత్యేకించి సునీతా విలియమ్స్ భగవద్గీతను ,వినాయకుడి చిత్రపటాన్ని ఆమె వద్ద ఉంచుకొని హిందూవుల గొప్పతనం గురించి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కలువాయి హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు రామచంద్రయ్య,ఐ.ప్రసన్నకుమార్,చల్లా విశ్వనాద్‌రెడ్డి,చల్లా విజయ్‌బాస్కర్‌రెడ్డి, నటకల కిషోర్,జి.వి రమణయ్య,మల్లికార్జున, పర్రి పెద మస్తానయ్య తదితరులున్నారు.

## వైసిపినేత కర్తం సురేంద్రరెడ్డి తల్లి మృతికి నివాళులర్పించిన ప్రతాప్‌రెడ్డి



**కావలి, మార్చి19 ప్రభాతవార్త :** బోగోలు మండలం వైసిపినేత కర్తం సురేంద్రరెడ్డి తల్లి మృతిచెందడంతో వైసిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కు మార్‌రెడ్డి వైసిపి నేతలతో ఆయన నివాసానికి వెళ్లారు. మృతదేహంపై పూలమాల ఉంచి నివాళు లర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ప్రతాప్‌రెడ్డి వెంట కావలి పట్టణ, బోగోలు మండల వైసిపినేతలు పాల్గొని నివాళులర్పించారు.

## పీడీఎఫ్ యూట్యూబ్‌లపై చర్యలు తీసుకోవాలి



**ఉదయగిరి, మార్చి 19, ప్రభాతవార్త :** పీడీఎఫ్ యూట్యూబ్‌లపై చర్యలు తీసుకోవానలి నాల్గు మండలాల అంగన్‌వాడీలు బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు ఎస్ఐ కర్నాటి ఇంద్ర సేనారెడ్డికి వారు మనోభావాలను దెబ్బతిస్తూ వచ్చిన కథనాలు రాసిన వారిపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జరిగిన విషయంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎటువంటి సంబంధం లేదని మా అంగన్‌వాడీలను టార్గెట్ చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన పోషణ్ భీ పడాయి భీ కార్యక్రమంలో భాగంగా కార్యకర్తలు చేస్తున్న ఓ దృశ్యాన్ని వారు యూట్యూబ్‌లో పెట్టడంతో కార్యకర్తల ఇళ్లలో తగాదాలకు దారి తీస్తూ అంగన్‌వాడీ కార్యకర్తల మనోభావాలను దెబ్బతీస్తున్నాయని అట్టి వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్సైను వారు కోరారు. లేని పక్షంలో ఎస్పీకి, కలెక్టర్‌కు సంబంధిత అధికారులకు తెలియపరిచి వారిపై చర్యలు తీసుకునే అంత వరకు ఉద్యమాలను చేపడతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మొదలైన వేసవి తీవ్రత



**ఉదయగిరి, మార్చి 19, ప్రభాతవార్త :** నియోజకవర్గ కేంద్రమైన ఉదయగిరిలో గురువారం ఉదయం 11గంటలకే ఉదయగిరి బస్టాండ్ బోసిపోయింది. పెరుగుతున్న వేసవి తీవ్రత వల్ల ఎక్కడికక్కడ ప్రజలు ఇళ్లకు చేరుకోవడంతో ఉదయగిరి బజారులో జన సంచారం కరువైంది. గ్రామీణ ప్రాంతాల నుంచి జనాలు రావడం తగ్గటం వల్ల వ్యాపారాలు కూడా కొంచెం నెమ్మదించాయి. మార్చి నెలలోనే ఈ విధమైనటువంటి ఏప్రిల్, మే నెలల పరిస్థితి ఏమిటి అంటూ ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

## అట్టహాసంగా తులసి భవాని వార్షికోత్సవ తిరునాళ్ల



**ఉదయగిరి, మార్చి 19, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని సర్వనాబాదులో ఉన్న శ్రీ తులసి భవానీ దేవస్థాన వార్షికోత్సవ తిరునాళ్ల బుధవారం అభిషేకాలతో అట్టహాసంగా జరిగింది. తులసి భవానీ అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు కుంకుమ పూజ అభిషేకాలు అనంతరం గ్రామోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. మొక్కులు చెల్లించుకుని తీర్థ ప్రసాదాలు అందుకుని మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారిగ్రామోత్సవంలో భాగంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

## కండలేరులో 50.025 టీయంసీల నీటిమట్టం

**కండలేరుడ్యాం(రాపూరు),మార్చి10ప్రభాతవార్త :** మండలంలోని కండలేరు జళాశయంలో బుధవారం ఉదయం 6 గంటలకు 50.025 టీయంసీల నిటిమట్టం నమొదు అయినట్లు కండలేరు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. జళశయంనుండి అవుట్‌ఫ్లోగా హెడ్ రెగ్యులేటర్ నుండి 610 క్యూసెక్కులు,లో లెవల్ స్లూయిస్ ద్వారా 110 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ ద్వారా 80 క్యూసెక్కుల చోప్పున మొత్తం 800 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఎఇ తిరుమలయ్య తెలిపారు.



## కండలేరులో చెన్నై మెట్రో వాటర్ బృందం



**కండలేరుడ్యాం(రాపూరు),మార్చి19ప్రభాతవార్త:** తెలుగుగంగలో అంతర్భాగమైన కండలేరు జళాశయాన్ని బుదవారం చెన్నై మెట్రో వాటర్ బృందం పరిశీలించింది. ఈ సందర్బంగా వారు తెలుగుగంగ ఇంజనీర్లతో కలసి జళాశయంలోని నిటి నిల్వలు గూర్చి చర్చించారు. ఏప్రిల్ నెల నుండి చెన్నై నగర వాసుల దాహర్తిని తీర్చే నిమిత్తం నీటిని విడుదల చేయాలని కండలేరు ఇంజనీరింగ్ అధికారులను కోరారు.చెన్నై మెట్రో వాటర్ బృందంలో సిఇ జానకీ, ఎస్ఇ మహేష్ నాగార్జున, ఇఇ ఎన్.తిలైకర్,ఎఇఇ పిఆర్ రాజా, ఎఇ ఎ.భరత్, కండలేరు ఎస్ఇ ఎన్.రాధాకృష్ణా రెడ్డి, ఇఇ పి.విజయ కుమార్ రెడ్డి,
డిఇఇ యం.విజయ రామి రెడ్డి, ఎఇలు కె.తిరుమలయ్య, పి.వి.శ్రీనివాస రావు, ఎఇఇలు డి.అనీల్ కుమార్, కె.అనీల్ బాబు తదితరులున్నారు.

## రాపూరు కోత్త హరిజనవాడలో చెత్తతో నిండిన డ్రైనేజిలు



**రాపూరు,మార్చి19ప్రభాతవార్త :** మండల కేంద్రమైన రాపూరులోని కోత్త హరిజన వాడలో డ్రైనేజిలో చెత్తతో నిండుకోని పోయినట్లు స్థానికులు తెలుపుతున్నారు. దీంతో ఈ ప్రాంతలలో దోమలు అవాసాలు చేసుకోవడంతో వాటి బారిన పడి తాము అనేక రోగాల బారీన పడి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి సకాలంలో కాలువలు శుభ్రపరిచి దోమల నివారణా చర్యలు చెపట్టి ప్రజలను రోగాల బారినుండి కాపాడాలని కోరుతున్నారు.

## వాహనదారులు రవాణా నిబంధనలు పాటించాలి



**రాపూరు,మార్చి19ప్రభాతవార్త :** వాహనదారులు తప్పని సరిగా రవాణా శాఖ నిబంధనలు పాటించాలని రాపూరు ఎస్ఐ వెంకట రాజేష్ కోరారు. బుదవారం ఆయన రాపూరులో బస్టాండ్ వద్ద వాహనాల తనిఖీని చెపట్టారు. పలు వాహనాలను నిలుపుదల చేసి వాటికి సంబందించిన పత్రాలు సరిగా వున్నాయా,లేవా అన్న విషయాలను పరిశీంచడంతో పాటు, డ్రైవర్ లైసెన్స్ కలిగి వున్నాడా,లేదా డ్రైవింగ్ సమయంలో మద్యం సేవించి వున్నారా అన్న విషయాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని పలు వాహనాలకు అన్‌లైన్ జరిమానాలు విధించారు. వాహన దారులు తప్పని సరిగా వాహనానికి సంబందించిన అన్ని పత్రాలను కలిగి వుండాలన్నారు. డ్రైవర్ తప్పని సరిగా లైసెన్స్ కలిగి వుండాలని తెలిపారు.
ట్రాఫిక్‌పై దృష్టి సారించండి రాపూరు పట్టణంలో ప్రధాన రహదారి జాతియ రహదారిగా మారినప్పటి నుండి ఈ రోడ్డులో వాహన రాకపోకలు ఎక్కువైనాయి. అయితే ప్రధానంగా బస్టాండ్ ఎదురుగా రోడ్డుపై కూరగాయల అంగళ్ళు వారు దుకాణాల ముందు తోపుడు బండిలతో పాటు టామోటా బాక్సులు వుంచుతున్నారు. దీంతో పాటు చికెన్ దుకాణదారులు సైతం కోళ్ళు తెచ్చె బుట్టలను కూడా రోడ్డుపై పెట్టడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో పాటు పెంచలకోనకు వెల్లే దారిలో దుకాణదారులు అన్ని ఆక్రమణ దుకాణాలు ఐనప్పటికి వారు వున్న దుకాణాల కంటే రోడ్డుకు సగంకు పైగా వారి వస్తువులను వుంచడంతో ప్రతి నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. ఐతే వాహన రాకపోకలపై దృష్టి సారిస్తున్న పోలీసులు ట్రాఫిక్‌కు అడ్డంగా ఇబ్బందిగా వున్న అక్రమణలపై పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు,పోలీసుల స్పందించి దుకాణాల ముందు రోడ్డుపై అడ్డంగా పెడుతున్న సామాన్లు తోలగించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## రేవూరులో సినిమా షూటింగ్



**అనంతసాగరం, మార్చి 19, ప్రభాతవార్త:** మండలంలోని రేవూరులో బుధవారం స్థానిక ప్రవాస భారతీయుడు బోయేళ్ళ జనార్ధన్‌రెడ్డి నిర్మాణ సారధ్యంలో అసుర సంహారం సినిమా షూటింగ్ జరిగింది. ఈసందర్భంగా సినిమా దర ్శకుడు కిషోర్ శ్రీకృష్ణ మాట్లాడుతూ ప్రముఖసీనియర్ నటులు తనికెళ్ళ భరణి ప్రధాన పాత్రలో రూరల్‌మర్డర్ మిస్టరీ నేపథ్యంలో సినిమా ఉంటుందన్నారు. బోయిళ్ళ సాయి ప్రవర్తిక , సాయి శ్రీమంత్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారని , వారం రోజులపాటు మండల పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరుపుకుం టుందన్నారు.

## వరి కొనుగోలు కేంద్రాలు, రైతు రిజిస్ట్రేషన్‌పై అవగాహన చాలా అవసరం



**తోటపల్లి, మార్చి 19, ప్రభాతవార్త :** తోటపల్లిగూడూరు మండలం వెంకన్నపాలెం, పొట్లపూడి గ్రామాలలో పొలం పిలుస్తోంది వ్యవసాయాధికారిణి శిరీషారాణి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి కొనుగోలు కేంద్రాలపై, రైతు రిజిస్ట్రేషన్‌లపై అవగాహన కల్పించారు. వరి కోతలు నిర్వహిస్తున్న రైతులందరూ తప్పనిసరిగా ఆర్ఎస్కేలలో షెడ్యూలింగ్ చేయించుకోవాలని తేమ శాతం చూపించుకోవాలన్నారు. రైతులు తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకోవాల్సిన అవసరం లేదని, వరి కొనుగోలు కేంద్రాలలో మంచి ధరకు పుట్టికి రూ.19720లు ధర ఉంది కనుక కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని అమ్ముకోవాలని రైతులకు అవగాహన కల్పించారు. తేమ శాతం 17 కంటే ఎక్కువ ఉంటే 1 శాతం తేడా తేమకు క్వింటాలుకు ఒక కేజీ ధాన్యం అనగా పుట్టికి 8.5 కేజీల ధాన్యం అదనంగా ఇచ్చి ధాన్యాన్ని అమ్ముకోవచ్చని రైతులకు అవగాహన కల్పించారు. షెడ్యూలింగ్ చేయించుకున్న తర్వాత సొసైటీల ద్వారా గోనె సంచులు పొందవచ్చని తెలిపారు. హమాలి ఛార్జీలు రవాణా ఛార్జీలు రైతుకు ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు. దళారీలను నమ్మి మోసపోవద్దని తెలిపారు. రైతులందరూ అవగాహనతో ధాన్యాన్ని మంచి ధకు కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకోవాలని వివరించారు. ప్రతి రైతు కూడా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని రిజిస్ట్రేషన్ అయిన రైతు మాత్రమే ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ది పొందేందుకు అర్హుడని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు ఝాన్సీ, అనూష, రైతులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## హౌసింగ్ పీడీ పర్యటన



**అల్లూరు,మార్చి 19 ప్రభాతవార్త:** అల్లూరు మండలంలోని ఇసుకపల్లి పంచాయతీ పరిధిలో జువ్వగు. బి.ఎం.ఆర్ కాలనీ లో బుధవారం నెల్లూరు జిల్లా హౌసింగ్ పీడీ టి వేణుగోపాల్ ఎస్టీ లబ్ధిదారుల ఇళ్లను పరిశీలించి వారితో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై మొదటి వారంలోగా అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న ఇళ్లను పూర్తి చేసుకోవాలని మండలంలో 932 మంది ఇంటి నిర్మాణం పూర్తి చేసుకొని వారు ఉన్నారని ఎస్టీ లకు 75000 ఎస్సీ బీసీలకు 50000 కేంద్ర ప్రభుత్వం అదనంగా ఇచ్చే నిధులను లబ్ధిదారులు ఉపయోగించుకునేందుకు క్యాస్ట్ సర్టిఫికేట్ తీసుకొని హౌసింగ్ అధికారులు కలిస్తే అదనపు నిధులు వచ్చే విధంగా చేస్తారని ఆయన వారికి తెలియజేశారు ఇంటి నిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వం ఇచ్చే అదనపు నిధులను తెలియజేసి నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యే విధంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పనిచేయాలని హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు ను ఆదేశించారు .

## భారత్ పెట్రోలియం సంస్థకు, సోలార్ కంపెనీలకు మా భూములు ఇచ్చే ప్రసక్తే లేదు



**ఉలవపాడు, మార్చి 19, ప్రభాతవార్త :** మండలంలోని కరేడులో భారత్ పెట్రో లియం సంస్థకు, సోలార్ కంపెనీలకు మా భూములు ఇచ్చే ప్రసక్తే లేదని బుధవారం గ్రామ దేవత అయిన పోలేరమ్మ అమ్మవారికి టెంకాయలు కొట్టి మా గ్రామాన్ని మా భూములను కాపాడాలని గ్రామస్తులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కరేడు మాజీ ఎంపీటీసీ సభ్యులు మిరియం శ్రీనివాసులు పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాటకీయంగా రైతుల భూములను అరకొర నష్టపరిహారం చెల్లించి భూములు కాజేయడానికి ప్రయత్నం చేస్తున్నారని విమర్శి ంచారు. గతంలో ముఖ్యమంత్రి కందుకూరు బహిరంగ సభలో రైతులు భూములు ఇచ్చి సహకరించాలని ప్రకటించటం వలన రైతులు ఆందోళన చెందుతున్నారని రైతులు ముందుగానే మేల్కొని పోరాటానికి సిద్దం కావాలని శ్రీనివాసులు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీ పరిశ్రమలు ఎక్కడ ఏర్పాటు చేస్తున్న విషయాన్ని గోప్యంగా ఉంచటంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వాలు ఎన్ని కుట్రలు చేసినా ఎట్టి పరిస్థితుల్లో భూములు ఇచ్చే ప్రసక్తే లేదని శ్రీనివాసులు అన్నారు. పరిశ్రమలను ఎక్కడ ఏర్పాటు అనేటువంటిది ప్రభుత్వ అధికారులు గాని, ప్రజాప్రతినిధులుగాని స్పష్టంగా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. చెన్నైపాలెం నుంచి కరేడు మన్నేరు వరకు సుమారు పదహారు వేల ఎకరాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోబోతుందని ప్రచారం ఉన్నందున ప్రజలు, రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అలాంటి నిర్ణయం ఉంటే ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుంకాల రామసుబ్బారెడ్డి, చేజర్ల వెంకటరెడ్డి, కరేడు మాజీ సర్పంచ్ సుబ్బారావు, దారా శ్రీనివాసులు, కొల్లి కోట య్య, బిట్రగుంట కిష్టయ్య, అనోది హరిబాబు, ఆళ్ల సుబ్బారెడ్డి, కుసుర్తి సుబ్బారావు, వాక రాజశేఖర్‌రెడ్డి, బాపట్ల వెంకయ్య, మిడసల రమణయ్య, నాలం కోటయ్య, ఎం.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## మజ్జిగ చలివేంద్రం ప్రారంభం




**బిట్రగుంట మార్చి 19 ప్రభాతవార్త :** బోగోలు మండలం కొండబిట్రగుంట మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పా ఠశాలలో బుధవారం పాఠశాల ప్రధా నోపాధ్యాయులు మద్దులూరి ప్రసాదరావు ఆధ్వర్యంలో మండల అభివృద్ధి అధికారి సుబ్రహ్మణ్యం, మండల విద్యాశాఖ అధికారి ఎం జయమ్మ చేతుల మీదగ మజ్జిగ చలివేంద్ర ప్రారంభించారు.. ఈ సందర్భంగా దాత సంజయ్ రవి కొండను అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పిల్లలు కాఫీ, టీ తాగడం అలవాటు చేసుకోవద్దని మజ్జిగ అలవాటు చేసుకోవాలి అని సూచించారు ఎమ్.జయమ్మ మాట్లాడుతూ ప్రసాదరావు మజ్జిగ చలివేంద్రాన్ని దాతల సహాయంతో 30 సంవత్సరాల నుండి నిర్వహించడం అభినందనీయమని ప్రశం సించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి వైస్ చైర్మన్ యు. కౌసల్య ఎ. సుబ్రహ్మణ్య చారి సహోపాధ్యాయిని దేగా. విజిత విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు..

# ఎస్సీ వర్గీకరణ నిర్ణయం హర్షణీయం

– చంద్రబాబుకి పాలాభిషేకం



**నెల్లూరు, మార్చి 19, ప్రభాతవార్త– వైద్యం :** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో పరిధిలోని వేదయపాలెం సెంటర్ లో ఉన్న డాక్టర్ బాబు జగజ్జీవన్‌రామ్ విగ్రహం దగ్గర ఎస్సీ వర్గీకరణ చేసేందుకు నిర్ణయం తీసుకున్న చంద్రబాబు నాయుడికి ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మాతంగి కృష్ణ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేసి, స్వీట్లు పంపిణీ చేసి హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా టీడీపీ దళిత నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతో అన్ని కులాలకు న్యాయం చేసేలా క్యాబినెట్ నిర్ణయం స్వాగతిస్తున్నామన్నారు. రాజీవ్ రంజాన్ మిశ్రా కమీషన్ రిపోర్టుకు క్యాబినెట్ ఆమోదం ఆనందదాయకమని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకి, రాష్ట్ర మంత్రివర్గం ఆమోదానికి కృషి చేసిన రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి వర్యులు నారా లోకేష్‌కి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన ఘనత చంద్రబాబుకిదక్కిందన్నారు. 30 ఏళ్ల దళితుల పోరాటానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సముచిత గౌరవాన్ని ఇస్తూ మంచి నిర్ణయం తీసుకున్నారు. గతంలో చంద్రబాబునాయుడు ఎస్సీ వర్గీకరణపై స్పష్టమైన ప్రకటన చేశారు. ఎన్డీఏ భాగస్వామ్యంలో ఎస్సీ వర్గీకరణ జరగడం చాలాఆనందంగా ఉందన్నారు. దళితులకు చంద్రబాబు, కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు దళితులు అందరం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కుడుముల సుబ్బారావు, పలిగళ్ళ పెంచలయ్య, కువరపు నాగేశ్వరరావు, నందిపాటి ఇజ్రాయిల్, చల్లా భాస్కర్, శ్యాము, బిరుదోలు సుభాష్, గీతాకృష్ణ, పద్మ, తోడేటి మురళి, తాటిపర్తి బాబు, పదార్తి నరసింహులు, సుమన్, కొత్త చిన్న ఆంజనేయులు, ప్రసాద్, వేణు, సునీల్, చేవూరు మారుతి, వెంకట్, నాగార్జున, ఎన్.గోపి, నందిపాటి మల్లిఖార్జున, ఎం.మహేష్, నాగేంద్ర టీడీపీ దళిత నాయకులు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌పిఎస్ భూముల్లో చెట్లు ఉండడంతో హద్దులు చూపలేం తహసీల్దార్ చంద్రశేఖర్



**విడవలూరు, మార్చి 19, ప్రభాతవార్త :** మండలం ఊటుకూరు పంచాయతీలో 2019న ఎస్సీలకు ఎల్పిఎస్ భూములు 91 మందికి ఒక్కొక్కరికి ఎకరా చొప్పున పట్టాదారులుగా హక్కు కల్పించడం జరిగిందని తహసీల్దార్ కే చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అప్పటినుండి లబ్ధిదారులు భూమిని సాగు చేయకపోవడంతో కంప చెట్లు పెరిగిపోయినాయి. హద్దులు చూపమని లబ్ధిదారులు కోరారు. స్థానిక సర్వేయర్ ఎల్ పిఎస్ భూమిలోకి వెళ్లి పరిశీలన చేసి లబ్ధిదారులకు చెట్లు తొలగించుకోండి హద్దులు చూపుతామని తెలియపరిచిన చెట్లను తొలగించలేదు అలాగే గ్రామంలో దండోరా ఏర్పాటు చేసి తెలిపిన పట్టించుకోలేదు కాబట్టి ఆ భూములకు హద్దులు చూపడం వీలు కాదని తెలియజేశారు.

# ఎమ్మెల్యే సోమిరెడ్డి పై కాకాణి దుష్ప్రచారాన్ని మానుకోవాలి

– వరికి ప్రభుత్వంలో ఎక్కువ రేటు సరే.. తక్కువ రేటు కూడా అప్పుడే..!

– కాకాణికి టీడీపీ నాయకుల కౌంటర్



**ముత్తుకూరు, మార్చి 19, ప్రభాతవార్త :** వరికి ప్రభు త్వంలో ఎక్కువ రేటు సరే.. తక్కువ రేటు కూడా అ ప్పుడే అని మాజీ ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్ రెడ్డికి టీడీపీ నాయకుల కౌంటర్ ఇచ్చారు. ఈ సంద ర్భంగా మం డలంలోని దమ్మాయపాల్యేంలో టిడిపి నాయకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టిడిపి నాయ కులు సాగు నీటి సంఘం ఉపాధ్యక్షులు పల్లికొండ శీనయ్య మాట్లాడుతూ మద్దత్తు ధర ఏ ప్రభుత్వం లో ఎంత ఉందో తెలుసుకోవాలన్నారు.గతంలో ఆయన చేసిన తప్పిదాలు గురించి చెప్పాలంటే చాలా ఉన్నాయ న్నారు. చంద్రబాబు నాయుడు కూడా అసెంబ్లీలో రైతులకు మద్దతు ధర ఇవ్వాలని మాట్లాడారని, మీ రెప్పుడైనా అసెంబ్లీలో రైతుల గురించి మాట్లాడారా అని ప్రశ్నించారు. నేడు కూటమి ప్రభుత్వంలో రెండు మూడు రోజుల్లో పరిహారం ఇస్తూ వున్నారని గుర్తు చేశారు. దాన్యం కొనుగోలు చేయడంలో కూడా ప్రభు త్వం తగు చర్యలు తీసుకుంటోందని చెప్పారు. అయితే ఒక బస్తా యూరియా 400 రూపాయలకు ఎవరు కొన్నారో నిరూపించాలని నిలదీశారు. అయితే దళారులు అందరూ వైఎస్సార్సీపీలోనే ఉన్నారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు నాగార్జున, నర్సా రెడ్డి, కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# సీతారామపురంలో అగ్ని ప్రమాదం



**సీతారామపురం మార్చి 19 ప్రభాతవార్త :** మండలకేంద్రమైన సీతారామపురంలోని కురవ వీధిలో బుధవారం అగ్ని ప్రమాదం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివాములు సమీపంలో నిప్పువేయగా ఇండ్ల మధ్యఉన్న గడ్డివామి తగులు కొని పెద్ద ఎత్తున మంటలు ఎగిసి పడ్డాయి.దీంతో స్దానికులు అగ్నిమాపక సిబ్బందికి పోన్ చేయగా వారు వచ్చి మంటిల్ని ఆర్పివేశారు.

# జాతీయ 3వ మహాసభలు జయప్రదం చేయండి

**సైదాపురం, మార్చి 19, ప్రభాతవార్త :** మహారాష్ట్రలో జరిగే అఖిల భారత రైతు కూలి సంఘం మూడవ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షులు డీపీ పోలయ్య తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 2025 మార్చినెల21, 22, 23వ తేదీల్లో మహారాష్ట్రలోని నాందేడులో3వ జాతీయ మ హాస భలు జరగనున్నాయని తెలిపారు. ఈ సభలను వ్యవసాయ కార్మికులు,కౌలు రైతులు,కూలీలు హాజరై జయప్రదం చేయాలని ఆయన సూచించారు.



**CHANGE OF NAME**

I, REVUNURI SRINIVASA REDDY (Old Name), Resident of Kotturu, Vinjamuru Mandal, Vinjamuru, Nellore, Andhra Pradesh - 524228, I have changed my name as REVUNURI SRINIVASULU REDDY (New Name) S/o. REVUNURI RAMALINGA REDDY

**10వ తరగతి మార్కులలిస్ట్, టిసి. పోయినది**

బత్తల మనోజ్ కుమార్, S/o. B. మార్కండేయులు (లేటు) వెంగమాంబ నగర్, పాతూరు, వింజమూరుకు సంబందించిన 10వ తరగతి 2010-మార్చి మార్కులలిస్ట్ రోల్ నెంబరు.1017122736, టిసి అడ్మిషన్ నెంబరు.712 గల ఒరిజినల్ సర్టిఫికేట్లు వింజమూరు బంగ్లా సెంటరు నందు జిరాక్స్ తీసుకుంటుండగా పోయినవి. ఎవరికైనా దొరికిన యెడల క్రింది సెల్ నెంబరుకు తెలియజేయగలరు. సెల్: 70321 63546.

# వేసవికాలం వచ్చింది... దొంగతనాలు ఎక్కువగా జరుగుతాయి ఇంటికి తాళాలు వేసేవాళ్లు జాగ్రత్తలు పాటించాలి

**కావలి, మార్చి19 ప్రభాతవార్త :** వేసవికాలం వచ్చింది... దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని కావలి డీఎస్పీ పి.శ్రీధర్ తెలిపారు. ఇంటికి తాళాలు వేసి బయటకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. కావలి డీఎస్పీ కార్యాలయంలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మన సమాచారం మనమే ఇస్తున్నాం... అందువల్లే చోరీలు జరుగుతున్నాయి. పేపరోడు వేసిన పేపరు ఇంటిముందే ఉండడంతో ఇంట్లో ఎవరూలేరన్న సమాచారం తెలుస్తుందన్నారు. అలాగే పాలవాడు, పనిమనుషులకు ఉన్న సమాచారం వల్ల ఇంట్లో వ్యక్తులు లేరన్న పరిస్థితి తెలుస్తుందన్నారు. ఇంటికి తాళాలు బయటవేసి వెళ్లడంతో ఇంట్లోలేరన్న విషయం బయటకు పొక్కుతుందన్నారు. అందుచేత ఇంటికి లోపలితాళాలువేసి, తాళంతీస్తే అలారం మోగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరి ఇంటిని వారు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. వేసవికాలంలో ఇంటికి తాళంవేసి ఆరుబయట, మిద్దెపైన నిద్రిస్తారన్నారు. అదికూడా దొంగలు చోరీ చేసేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఇంటికి తాళంవేసి ఎక్కడికైనా వెళ్లాలనుకుంటే సంబంధిత పోలీసుస్టేషన్లో సమాచారమిస్తే ఆ ఇళ్లపై పోలీసు నిఘా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ సి.సి కెమెరాలు ఏర్పాటుచేసు కోవాలన్నారు. దీనివల్ల ఎంతో ప్రయోజనం ఉందన్నారు. విలువైన వస్తువులు ఇళ్లల్లో పెట్టకుండా లాకర్లో భద్రపరుచుకోవాలన్నారు. పోలీసుల సహకారం ప్రజలకు ఎల్లవేళలా అందించడం జరుగుతుదన్నారు. ప్రతి వ్యక్తి ఒక పోలీసే అని భావించాలన్నారు. నేరాలు జరగకుండా అందరూ జాగ్రత్తలు పాటిస్తూ పోలీసులకు సమాచారమివ్వాలన్నారు.

**–కావలిలో ఆకతాయిల రౌడీయిజం...**

కావలిలో రెండురోజులు రెండు కూడళ్లలో ఆకతాయిలు మద్యం మత్తులో రౌడీయిజానికి పాల్పడుతూఉంటే ఎటువంటి చర్యలు చేపట్టారని మీడియా ప్రశ్నించింది. నలుగురిపై కేసు నమోదుచేశామని డీఎస్పీ శ్రీధర్ చాలా సింపుల్‌గా చెప్పడం కొసమెరుపు. బాటిల్స్ తీసుకుని దాడిచేస్తూ షోకేసులు ధ్వంసం చేస్తే ఎలాంటి కేసులు నమోదుచేశారని మీడియా ప్రశ్నించింది. చట్టప్రకారమే కేసులు పెడుతున్నామని డీఎస్పీ శ్రీధర్ సమాధానమిచ్చారు. చోరీలు, నేరాలు, ఘోరాలు జరిగితే డిఎస్పార్‌లో ఎందుకు సమాచారం ఇవ్వడంలేదని అడగడంతో ఇకనుంచి సమాచారం ఇస్తామని డీఎస్పీ తెలిపారు. షేర్‌ట్రేడింగ్ ముసుగులో జరిగిన కోట్లాది రూపాయల మనీస్కాం ఏమైందని ప్రశ్నించగా సరైనా సమాధానం రాకపోవడం చెప్పుకోదగ్గ విశేషం.



# ప్రజాసమస్యలను వెంటనే పరిష్కరించాలి సిపిఎం నేతల డిమాండ్

**కావలి, మార్చి19 ప్రభాతవార్త :** కావలి పట్టణంలో నెలకొనిఉన్న ప్రజాసమస్యలను వెంటనే పరిష ్కరించకపోతే ప్రజలను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతా మని సిపిఎం నేతలు తీవ్రస్థాయిలో హెచ్చరి కలు చేశారు. బుధవారం కావలి సిపిఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య, పట్టణ కమిటి సభ్యులు వై.కృష్ణ మోహన్, జి.మధుసూధన్‌రావు, బి.కృష్ణయ్య, చెన్నయ్య, తదితరులు పాల్గొనిమాట్లాడారు. సిపిఎం రాష్ట్ర పిలుపుమేరకు ప్రజాసమస్యలపై ఈ నెల 8వ తేదీనుండి పదిరోజులపాటు ప్రజాచైతన్య యాత్రలు చేపట్టడం జరిగిందన్నారు. కావలి పట్టణంలోని ప్రజలు అనేక సమస్యలు సిపిఎం నేతల దృష్టికి తీసుకువ చ్చారన్నారు. పట్టణంలో ముసునూరు ఇందిరమ్మ కాలనీలు ఏర్పడి చాలా సంవత్సరాలు అయినప్పటికి మున్సిపల్ నీటిసరఫరా లేనందున అక్కడి ప్రజలు త్రాగునీటికోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ట్యాంకర్లద్వారా పోస్తున్న నీళ్లు త్రాగేందుకు పనికిరావని ప్రజలు డబ్బులుపెట్టి నీళ్లను కొనుక్కుంటున్నారని వారు తెలిపారు. అలాగే, 22వ వార్డులో ఇందిరా నగర్ పరిస్థితికూడా అలానే ఉందన్నారు. ఉన్న రెండు బోర్లు చెడిపోయాయన్నారు. అక్కడ బావినీళ్లతో ప్రజలు కాలం గడుపుతున్నారన్నారు. అలాగే మద్దూరుపాడు గ్రామంలో అరాకొరా నీళ్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముసునూరు ముస్లిం కాలనీ, అరుంధతీయవాడ, పట్టణంలోని మరికొన్ని ప్రాంతాల్లో మున్సిపల్‌వాటర్ సరఫరా లేనందున ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మద్దూరుపాడు టిట్కోగృహ సముదాయంలో గృహాలు పూర్తయి నప్పటికి ఇంకా చాలా మంది లబ్దిదారులకు రకరకాల కారణాలు చూపిస్తూ ఇళ్లు ఇవ్వకుండా ఆఫీసులు, బ్యాంకుల చుట్టూ తిప్పుకుంటున్నారన్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తికాకుండానే ఆగిపోయాయన్నారు. అందుచేత పేదలఇంటి కల, కలగానే మిగిలిందన్నారు. ఇవన్నీ ఇలా ఉంటే పెరిగిన కరెంటు చార్జీలు, ఇంటి పన్నులు, నీటి పన్నులు వేలాదిరూపాయలు బిల్లులు రావడంతో ప్రజలకు మోయలేనిభారం మోయాల్సి వస్తుందన్నారు. పెరిగిన ధరలతో కొని తినలేని పరిస్థితి పేదలకు దాపురించిందన్నారు. కూలిపనులుకూడా లేనందున కుటుంబాల పోషణ కష్టంగా మారిందన్నారు. పట్టణ ప్రజలు రకరకాల సమస్యలతో తల్లడిల్లుతున్నారన్నారు. ప్రజలకు మేలుచేస్తారని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో వైఫల్యం చెందిందన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలుచేయకపోగా ప్రజలపై భారాలు మోపి ఆందోళనకు గురిచేస్తున్నారన్నారు. ఇకనైనా సమస్యలు పరిష్కరించకుంటే ప్రజా ఉద్యమాలు తప్పవని హెచ్చరికలు చేశారు..



# అంగన్‌వాడీ కేంద్రాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి

**కోవూరు, మార్చి 19 ప్రభాతవార్త :** పూర్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థు లకు విద్యాబుద్దులు అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను మరింత ఆదర్శవంతంగా తీర్చిదిద్దేలా అంగ న్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో జ్యోతి అన్నారు. కోవూరులోని ప్రాజెక్టు కార్యాలయ సమావేశ మందిర ంలో బుధవారం కోవూరు, కొడవ లూరు, విడవలూరు, బుచ్చి మండలాలకు సంబంధంచిన అంగన్‌వాడీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 18వ తేది నుంచి మే 31 వరకు ప్రతి అంగన్‌వాడీ కేవంద్రంలో వేళలు ఒంటి పూట మాత్రమే నిర్వహించాలని, దీనిని ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త పారదర్శకంగా అమలు చేయాలన్నారు. ముఖ్యంగా ప్రతి నెల 10వ తేది లోగా కేంద్రంలో చిన్నారుల యొక్క ఎత్తు, బరువులు తప్పనిసరిగా తూచి యాప్‌లో , సంబందిత రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. కేంద్రాల పరిధిలో ఉన్న బాలింతలకు, గర్భవతులకు సకాలంలో పౌష్టికాహారం అందించలన్నారు. ఇటీవల శిక్షణలో నేర్చుకున్న అంశాలను కేంద్రంలో అమలు చేసేలా ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ సమీక్షలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాధిక, ప్రసన్న, ఉమా, నిర్మలా, సుమిత్ర, ప్రమీలా, నాగభూషణమ్మ, నాలుగు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.



# సామాజిక ఆరోగ్య కేంద్రం సేవలు సద్వినియోగం చేసుకోవాలి

**కోవూరు, మార్చి 19 ప్రభాతవార్త :** కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని, వీటిని ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటాచలపతి గౌడ్ అన్నారు. కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సామాజిక ఆరోగ్య కేంద్రంలో అన్ని విభాగాలకు సంబంధించి మంచి ప్రావీణ్యం కలిగిన వైద్యులు ఉన్నారని, సకాలంలో వారి సేవలను ఉపయోగించుకోవాలన్నారు. అదేవిధంగా గుండెపోటుకు సంబంధించి అత్యవసర పరిస్థితుల్లో టెన్ ప్లస్ ఇంజక్షన్లు సామాజిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉన్నాయన్నారు. గుండె పోటు లక్షణాలు కనిపించి గుండె దడ వంటి లక్షణాలు ఉంటే మొదటి గంటలోనే తీసుకోవాల్సిన చికిత్స 108 అంబులెన్స్‌కి ఫోన్ చేసి వెంటనే దగ్గరలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకురావాలన్నారు. మొదటి గంటలోనే ప్రాథమిక పరీక్షలు నిర్వహించి 45 వేల రూపాయలు విలువ గల టెన్ ప్లస్ ఇంజక్షన్‌ను ఉచితంగా అందించి రోగి ప్రాణాలు కాపాడేందుకు తమవంతుగా చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా ఆస్పత్రి పరిసరాల్లో మొక్కలు పెంచడం, పరిసరాల పరిశుభ్రతలో భాగంగా రోడ్డుకిరువైపులా గ్రావెల్ తోలించేలా ఈ కమిటీలో తీర్మాణం చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా ఆస్పత్రికి అవసరమైన కంప్యూటర్‌లు కొనుగోలు చేసేందుకు ఈ సందర్భంగా తీర్మాణం చేశారు. ఈ సమీక్షలో ఎంపీడీవో శ్రీహరిరెడ్డి, వైద్యులు డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ మైయుద్దీన్, అభివృద్ధి కమిటీ సభ్యులు మల్లికార్జున్‌రెడ్డి, వంశీ కృష్ణ, హెడ్ నర్సు ప్రసూనలత, ఫార్మసిస్ట్ నరసింహులుగౌడ్, ప్రసన్న, తదితరులు ఉన్నారు.



# నూతన పనులు గుర్తించేలా ప్రత్యేక దృష్టి

**కోవూరు, మార్చి 19 ప్రభాతవార్త :** రానున్న ఆర్థిక సంవత్సరానికి గానూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టనున్న పనులను పారదర్శకంగా గుర్తించేలా డ్వామా సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి అన్నారు. కోవూరులోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం డ్వామా ఫీల్డ్ సిబ్బందితో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం కింద చేపట్టే పనులకు సంబంధించి కూలీల శాతాన్ని మరింత పెంచాలన్నారు. వారందరికీ సకాలంలో జాబ్ కార్డు ఇచ్చేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. రికార్డు నిర్వహణ పారదర్శకంగా చేపట్టాలపన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం గృహ నిర్మాణ శాఖలో ఎస్సీ, ఎస్టీ బీసీ లబ్దిదారులకు నిధులు పెంచిన నేపథ్యంలో ఇళ్లు కట్టేందుకు లబ్దిదారులు ముందుకు వస్తున్నారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని కోవూరు, పడుగుపాడు పంచాయతీ పరిదిలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఉపాధి హామీ సిబ్బంది సమన్వయం చేసుకుని నిర్మాణాలు వేగవంతం అయ్యేలా చూడాలన్నారు. అదేవిధంగా డిగ్రీ కళాశాల స్థలంలో ఈ పథకం ద్వారా చేపట్టిన హై డెన్సిటీ ప్లాంటేషన్‌కు క్రమం తప్పకుండా నీరు పట్టేలా చూడాలన్నారు. చేపట్టే పనులు ప్రభుత్వం నిర్దేశించినే నాణ్యతా ప్రమాణాలకు లోబడి చేయాలన్నారు. ఈ సమీక్షలో డ్వామా ఏపీవో మధు, సిబ్బంది ఉన్నారు.



## ఇంకుడు గుంటల నిర్మాణానికి మోడల్‌గా చెంచుగానిపాలెం



**కావలిరూరల్, మార్చి19 ప్రభాతవార్త** స్వచ్ఛఆంధ్ర, స్వచ్ఛగ్రామంలో భాగంగా వందశాతం ఇంకుడు గుంటలు ఉన్న గ్రామంగా కావలి రూరల్ మండలం చెంచుగానిపాలెం గ్రామాన్ని మోడల్‌గా ఎంపిక చేసినట్లు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తెలియచేశారని డ్వామా పిడి గంగాబవాని తెలిపారు. చెంచుగానిపాలెం గ్రామంలో బుధవారం ఇంకుడుగుంటల నిర్మాణాన్ని డ్వామాపిడి గంగాభవాని ఎపిడి మృదుల, కావలి ఎంపిడిఓ శ్రీదేవితో కలిసి పరిశీలించడం జరిగింది. ప్రతి ఇంటికి ఇంకుడు గుంటలు ఉండే విధంగా చూడాలని వారం రోజుల్లో నిర్మాణంలో ఉన్న అన్ని ఇంకుడు గుంటలను పూరిచేయాలని ఎంపిడిఓ శ్రీదేవిని ఆదేశించడం జరిగింది. అనంతరం ఆమె మాట్లాడారు. గ్రామాల్లో సరైన డ్రైనేజి కాలువలు లేక నీటి నిల్వలతో గ్రామాలు మురికికూపంగా ఉంటున్నాయని తెలియచేశారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు మిగిలిన గ్రామాల్లో అమలు చేసేందుకు చెంచుగానిపాలెంను మోడల్‌గా తీసుకోవడం జరిగిందని తెలియచేశారు. ఈ గ్రామంలో 401 గృహాలు ఉండగా ఇప్పటికే 180 ఇళ్లకు గతంలో ప్రభుత్వం ఇంకుడు గుంటలను నిర్మించడం జరిగిందని తెలియచేశారు. 35 గృహాలవారు వారే స్వయంగా ఇంకుడు గుంటలను త్రవ్వుకోవడం జరిగిందని తెలియచేశారు. మిగిలిన 186 గృహాలకు ఇంకుడు గుంటలను ప్రభుత్వం నిర్మిస్తున్నట్లు తెలియచేశారు. జెడ్పీటీసి జంపాని రాఘవులు, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, సచివాలయ పంచాయితి కార్యదర్శి విజయ, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులలో తప్పిదాలు జరగకుండా చూసుకోవాలి



**ఉదయగిరి, మార్చి 19, ప్రభాతవార్త** ఉదయగిరి మండల పరిధిలోని మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులలో ఎటువంటి తప్పిదాలు జరగకుండా చూసుకోవాలని ఉదయగిరి ఎంపీడీఓ అప్పాజీ తెలిపారు. బుధవారం ఆయన పట్నంలోని శ్రీ శక్తి భవనంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 23, 24 సంవత్సరానికి గాను జరిగిన 17వ విడత సామాజిక తనిఖీలలో భాగంగా జరిగిన తప్పిదాలను 25, 26 సంవత్సరాలలో జరగకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. పోయిన సామాజిక తనిఖీలలో భాగంగా తప్పిదాలు మరలా పునరావృతం కాకుండా చూసుకోవాలని ఎంపీడీఓ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఆటోలో నుంచి జారిపడిన వ్యక్తి మృతి



**ఉదయగిరి, మార్చి 19, ప్రభాతవార్త** ఉదయగిరి మండల పరిధిలోని సున్నంవారిచింతల సమీపంలో ఆటోలో నుంచి జారిపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఎస్టీ కాలనీకి చెందిన వేమూరి కొండయ్య ఉదయగిరికి వచ్చి పనులు ముగించుకుని ఉదయగిరి నుంచి ఆటోలో తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఆటోలో వెనుక కూర్చొని ఉన్న వ్యక్తి జారీ పడ్డారు. చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందడంతో పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరి తరలించారు. ఎస్సై ఇంద్రసేనారెడ్డి కేసు నమోదు చేసి పరిశీలిస్తున్నారు.

## ఎమ్మెల్యే సహకారంతో జయభారత్ హాస్పిటల్ కంటి శస్త్ర చికిత్సలు



**కోవూరు, మార్చి 19 ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గ పరిధిలోని కొడవలూరుకు చెందిన నలుగురికి ఎమ్మెల్యే వేమిరెడ్డిప్రశాంతిరెడ్డి చొరవతో నెల్లూరు నగరంలోని జయభారత్ హాస్పిటల్‌లో కళ్ళకు శస్త్రచికిత్సలు నిర్వహించారు. పేదలకు వైద్య సహాయం అందివ్వడంలో చొరవ చూపించిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఔదార్యంపట్ల కళ్ళకు శస్త్రచికిత్సలు చేయించుకున్న వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## వైవీ సుబ్బారెడ్డికి ప్రసన్న పరామర్శ



**కోవూరు, మార్చి 19 ప్రభాతవార్త :** వైసీపీ రాజ్యసభ సభ్యులు, వైవీ సు బ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ మృతిచెందారు. ఈ మేరకు బుధ వారం ఒంగోలులోని సోమవర ప్పాలోని వైవీ సుబ్బారెడ్డి గృహానికి మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి వెళ్లి ఆయనను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు, ఎస్సీ సెల్ నాయకులు ఉదయభాస్కర్, తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే చర్యలు



**చేజర్ల మార్చి 19 ప్రభాతవార్త** చేజర్ల మండలంలోని ఆదూరుపల్లి గ్రామంలోని గురుకుల పాఠశాల ఎదురుగా ఉన్నటువంటి ప్రభుత్వ భూమిని అదే గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమించినట్లు అదే గ్రామానికి చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేయడంతో తహసిల్దారు.బి .మురళీ పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ భూమిలో ఏలాంటి కట్టడాలు కట్ట వద్దని అక్రమదారులను హెచ్చరించారు. అదేవిధంగా తక్షణం కట్టడాలు నిలుపుదల చేయించారు. ఈ భూమి పై పూర్తి స్ధాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈకార్యక్రమంలో తహసిల్దారు వెంట ఆర్ఐ వెంకటేశ్వర్లున్నారు.

## శభాష్ సునీత మేడమ్



**బుచ్చి మార్చి 19 ప్రభా తవార్త :** అంతరిక్షంలో అద్భుతాలు ఆవిష్కరించి పరిశోధన కోసం వెళ్ళిన సునీత విలియమ్స్ జీవి తం నేటి తరా నికి స్ఫూ ర్తిదాయకమని కలాం పుం స్కార గ్రహిత గండికోట సుధీర్‌కుమార్ అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పం చాయితీ రామచంద్రా పురంలో అంతరిక్ష శాస్త్ర వేత్త సునీతా విలియమ్స్ జీవిత చరిత్రను బుధవారం విద్యార్దులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు 8 రోజులు పరిశోదన చేయడానికి వెళ్ళి 8 నెలలైనా ఆమెలో సడలని ఆత్మ విశ్వాసం దృడ చిత్తం నేటి విద్యార్దులకు స్ఫూర్తి దాయకమని పేర్కొన్నారు.సురక్షితంగా భూమికి తిరిగి వచ్చిన సునీత విలియమ్స్ ఆత్మ విశ్వాసానికి కేరింతలు కొడుతు విద్యార్దులకు స్వీట్లు పంపిణి చేశారు. విద్యార్దులు స్దానికులు పాల్గోన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ప్రత్యేక దృష్టి

### వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తా





**కోవూరు, మార్చి 19 ప్రభాతవార్త :** ఆర్టీసీ ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని, అదే సమయంలో ఆర్టీసీ కుటుంబ సభ్యులైన కార్మికులు ఉద్యోగ సమస్యల పరిష్కారంలో తగు చొరవ తీసుకుంటామని ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీల పరిధిలో ఉన్న ఆర్టీసీ జోనల్ వర్క్‌షాప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వర్క్‌షాప్‌లో ఉన్న పలు విభాగాలను నిశిత పరిశీలన చేసి కార్మికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోన్ పరిధిలో ఉన్న 27 డిపోలను ఇటీవల పరిశలించడం జరిగిందన్నారు. ఆయా డిపోల్లో ఉన్న ఆర్టీసీ ఉద్యోగుల కార్మికుల సమస్యలను ఆర్టీసీ ఉన్నతాధికారుల దృష్టికి కూటమి ప్రభుత్వంలో ఉన్న మంత్రులు దృష్టికి తీసుకెళ్లేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రయాణి కులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేలా ఇటీవల దృష్టి సారించడం జరిగిందన్నారు. ఈ పడుగుపాడులో ఉన్న వర్క్‌షాప్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. దాదాపు 250 మంది పర్మినెంట్, కాంట్రాక్ట్ ఉద్యోగులు పనిచేస్తున్నారన్నారు. ప్రధానంగా ఈ వర్క్‌షాప్‌కు పడుగుపాడు పంచాయతీ నుంచి 24 గంటలు మంచినీటి సదుపాయం ఉండేదని, ప్రస్తుతం అది రాకపోవడంతో ఈ విషయాన్ని సంబంధిత పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి తిరిగి ఏర్పాటు చేసేలా తగు చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా ఈ వర్క్‌షాప్‌లో పనిచేస్తున్న కార్మికుల కు ఉద్యోగులకు ప్రత్యేక మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసేలా చూస్తామన్నారు. ఈ వర్క్‌షాప్‌లో 110 డిగ్రీల వేడిలో కార్మికులు పనిచేస్తున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకుని దాతల సహకారంతో కూలర్స్ ఏర్పాటు చేసేలా తగు చర్యలు తీసుకుంటామన్నారు.ఈ వర్క్‌షాప్‌లో గత25 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తు న్నారని, పీఎఫ్ పోనువ వారికి జీతం 10 వేల వ స్తుందని, సుప్రీంకోర్టు గౌడ్ లైన్స్ ప్రకారం వారికి 25 వేలు జీతం రావాలని ఈ విషయం కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. వర్క్స్ మేనే జర్ ఇబ్రహీం మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 33 డిపోల నుంచి అశోక్ లైలాండ్ వాహనాలకు సంబంధించిన విడి భాగాలు, ఇతర పరికరాలు ఈ వర్క్‌షాప్‌లో ఉంటాయన్నారు. సుమారు 2000పైగా బస్సులు ఈ వర్క్‌షాప్‌లో వస్తున్నాయన్నారు. తొలిసారిగా డిపోకు వచ్చి ఆర్టీసీ కార్మికుల సమస్యలపై దృష్టి పెట్టిన చైర్మన్‌ను ప్రత్యేకంగా అభినందిస్తున్నారు. ఎన్ఎంయూ రాష్ట్ర నాయకులు ఎల్లయ్య మాట్లాడుతూ తమ డిపోకు వచ్చి కార్మిక ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిన ఏకైక వ్యక్తి సురేష్‌రెడ్డినే అన్నారు. ఈ సందర్భంగా ఆయనను ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నేతలు ఎస్‌కే సాబ్జాన్, కె. సుధాకర్, పి. రమేష్, తదితరులు ఉన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలి




**సైదాపురం, మార్చి19, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ఏర్పా టు చేసిన ధాన్యం కొనుగోలు కేం ద్రాలను రైతులు వినియోగిం చుకుని వరి ధాన్యాన్ని విక్రయిం చి మద్దతు ధర పొందాలని మం డల వ్యవసాయశాఖ అధికారిణి హైమావతి తెలిపారు. మండల పరిధిలోని తురిమెర్ల, గిద్దలూరు రైతు సేవా కేంద్రం పరిధిలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించి ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అవగాహన కల్పించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం రైతులు విక్రయించుకుని మద్దతు ధర పొందాలని ఆమె సూచించారు. తేమ శాతం గన్నిబ్యాగ్స్ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. విక్రయించిన 24గంటల్లోనే తమ ఖాతాల్లో నగదు జమ చేయడం జరుగుతుందని ఆమె రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో సర్వేలను పూర్తి చేయాలి



**సైదాపురం మార్చి 19, ప్రభాతవార్త :** మండలంలో జరుగుతున్న వివిధ సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ తెలిపారు. మండల పరిధిలోని కొమ్మిపాడు, మర్లపూడి గ్రామంలో ఉన్న సచివాలయాలను బుధవారం ఆ యన పరిశీలించారు. ఈ సందర్భంగా హాజ రు పట్టికలను పరిశీలించి పలు రికార్డు లను తనిఖీచేశారు.కొమ్మిపాడు, మర్లపూడి సచి వాలయం పరిధిలో కొంత మంది ఉద్యో గులు సర్వే చేయడంలో వెనుకబడినందున వారికి క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే ఇబ్బందులను, సందేహాలను నివృత్తి చేయడం జరిగిందన్నారు. అనంతరం మర్లపూడి హైస్కూల్‌ను సందర్శించి డొక్కా సీతమ్మ మధ్యాహ్న బోజన పథకాన్ని పరిశీలించారు.

## మహిళలు, గర్భవతులు పౌష్టికాహారం తీసుకోవాలి



**కావలిరూరల్, మార్చి19 ప్రభాతవార్త :** డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో కావలి, ముసునూరు మర్రిచెట్టు గిరిజనకాల నీలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం మ హిళలకు, గర్భవతులకు ఆరోగ్యంపై అవగా హన కార్యక్రమం ఏర్పాటుచేయడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త ఎం.మాలకొండారెడ్డిలు మాట్లాడారు. పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తెలియచేశారు. చిరుధాన్యాల ప్రాముఖ్యత, రక్తహీనత నివారించుట, లింగవివక్షత గురించి అవగాహన కల్పించడం జరిగింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌషికాహారాన్ని గర్భవతులు, బాలింతలు తీసుకోవాలని తెలియచేశారు. మహిళలు, గర్భవతులు, బాలింతలు రక్తహీనతను అధిగమించాలని కోరారు. అనంతరం డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో రక్తహీనతను అధిగమించడానికి ఐరన్‌పాలిక్ సిరప్స్‌ను పంపిణి చేయడం జరిగింది. అంగన్‌వాడీ టీచర్లు దీనమ్మ, గర్భవతులు, బాలింతలు, మహిళలు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో వృద్ధులకు వైద్య పరీక్షలు



**పొదలకూరు, మార్చి 19, ప్రభాతవార్త :** పొదల కూరు నరసారెడ్డి కాలనీలోని లక్ష్మి మహిళా మండలి వృద్ధాశ్రమంలో స్పెషలిస్ట్ డాక్టర్లచే వృద్ధు లకు ఎన్సీడీ కార్యక్రమంలో భాగంగా వైద్యపరీక్ష లు నిర్వహించారు. ఇందులో జనరల్ ఫిజీషియ న్, డెంటల్ డాక్టర్ ఫిజియోథెరపిస్ట్, గైనకాలజీ డాక్టర్ ,సైకియాట్రి సంబంధించినటువంటి వైద్య నిపుణులు వచ్చి వృద్ధులకు పరీక్షలు నిర్వహించారు. తద నంతరం వృద్ధుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని తరచూ వైద్య పరీక్షలు చేయించుకుంటూ వైద్యుల సూచనల మేరకు మాత్రలు మింగాలని పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఇందులో భాగంగా ఏడుగురికి కంటికి సంబంధించినటువంటి క్యాటరాక్ట్ ఆపరేషన్ అవసరమైన గుర్తించి వారిని నెల్లూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి రెఫర్ చేసారు. వీరికి ఎప్పుడూ కాంట్రాక్ట్ ఆపరేషన్ చేసేది త్వరలో తెలియజేస్తామని వైద్యాధికారి డాక్టర్ కిరణ్ రిషిత తెలియ జేశారు. ఆరోగ్య సహాయకులు ఎం రాధా కుమారి, సాని శివ ప్రసాద్, మిడ్లేవల్ హెల్త్ ప్రొవైడర్ టి సుమాం జలి, సచివాలయం ఎఎన్ఎం కృష్ణమ్మ, ఆశా కార్యకర్తలు ఉష,సీత,లక్ష్మి, ఆశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు.

## మర్రిపాడు కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తులు



**మర్రిపాడు,మార్చి19,ప్రభాతవార్త:**2025-26 విద్యాసంవత్స రానికి 6వ తరగతి, 11వ తరగతుల్లో మండల కేంద్రంలోని మర్రిపాడు కస్తూరిభాగాంధీ విద్యాలయాల్లో (కెజిబివి) ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్స్‌పాల్ సి.హెచ్.లక్ష్మీదేవి తెలిపారు. వీటితోపాటు 7,8,9 తరగతుల్లో మిగిలిన సీట్ల ను కూడా భర్తీ చేస్తామన్నారు. మార్చి 19వ తేదీ నుండి ఏప్రిల్ 11వ తేదీవరకు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. అనాధలు, బడిబయట పిల్లలు, బడిమా నేసిన వారు, పేద ,ఎస్సీ,ఎస్టీ, బిసి, మైనార్టీ , దారిద్ర్యరేఖకు దిగు వన జీవిస్తున్న బాలికలు ప్రవేశాలకు అర్హులని , ఈసేవా కేంద్రాలు, గ్రామ సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకు నేం దుకు విద్యార్థి ఆధార్‌కార్డ్, ప్రస్తుత పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, తల్లిదండ్రుల ఆధార్‌నెంబర్లు తీసుకొని వెళ్ళాల న్నారు. ఆదాయధృవీకరణ పత్రం, కుల ధృవీకరణ పత్రాలను జతచేయాలన్నారు. బడిమానేసిన బడిఈడు ఆడపిల్లలు , అనాధపల్లిలు, తల్లి కాని, తండ్రిని కాని కోల్పోయిన ఆడపిల్లలు సంబంధిత ధృవీకంణ పత్రాల ను జతచేయాలన్నారు. ఉన్నత విద్యార్హతలు, అనుభవం, అంకిత భావం కలిగిన ఉపాధ్యాయులచే వి ద్యాబోధన, క్రమశిక్షణ, ఉత్తమ ఫలితాల సాధనలో కెజిబివి ముందంజలో ఉన్నాయన్నారు. అన్ని ప్రభుత్వ పథకాలతోపాటు ఉచిత విద్య, వసతి కల్పించబడుతుందన్నారు. 6నుండి 12వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలో విద్య, 8నుండి10వ తరగతులకు సిబిఎస్ఇ సిలబస్‌లో విద్యాబోధన ,ఐఎఫ్‌పి,టిఎబిల ద్వారా విద్యాబోధన, భరత్‌స్కౌట్ యూనిఫాం, ప్రతిరోజు యోగా ,ఆరోగ్య వ్యాయామం విద్య, క్రీడలు ఉం టాయన్నారు. వివరాలకు కళాశాల ప్రిన్స్‌పాల్ లక్ష్మీదేవి ఫోన్ నెంబర్ 9000850953లో సంప్ర దించమని వారు తెలిపారు.

## డిసిపల్లిలో ప్రారంభమైన పొగాకు కొనుగోలు

### - కిలో పొగాకు గరిష్ట ధర 280 రూపాయలు



**మర్రిపాడు,మార్చి19,ప్రభాతవార్త:** మర్రిపాడు మండల పరిధిలోని డిసిపల్లి పొగాకు వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్ళు బుధవారం ప్రారంభమయ్యాయి.పొగాకు వేలంకేంద్రంలో ముం దుగా పూజా కార్యక్రమాన్ని చేపట్టి పొగాకు కొను గోలును వేలం నిర్వహణాధికారి జి.రాజశేఖర్ ప్రారంభించారు. దీంతో తొలిరోజు వేలం కేంద్రా నికి పొగాకు రైతులు 18పొగాకు బేళ్ళను తీసుకురాగా వివిధ కంపెనీల బయర్లు వేలంలో పాల్గొని పొగాకు ఒక కిలోకు 280రూపాయలకు కొనుగోలు చేసినట్లు వేలం కేంద్ర నిర్వహణాధికారి జి.రాజశేఖర్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది కంటే ఈ ఏడాది పొగాకు వేలం ప్రారంభంలోనే ఒకేసారి పొగాకు కిలోకు 50రూపాయలు పెరగడం సంతోషకరమన్నారు. రైతులు వేలం కేంద్రం రైతు అసోసియేషన్ అధ్యక్షుడు మూలి వెంగయ్య, గాలి నరసపనాయుడు మాట్లాడుతూ పలొగాకు రైతులు పొగాకు పంటకు అధిక పెట్టుబడులు పెట్టి ఉన్నారని రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈకార్యక్రమంలో రైతులు, బయర్లు పాల్గొన్నారు.

# వినియోగదారుల కేసుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలేంటి



**నెల్లూరురూరల్,మార్చి 19,ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రంలో వినియోగదారులకు సంబంధించి కేసుల పరిష్కారానికి కేంద్రం తీసుకుంటున్న చర్యలు ఏమిటని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. బుధవారం లోక్‌సభలో ఆయన పలు అంశాలపై ప్రశ్నలువేశారు.ఆంధ్రప్రదేశ్ స్టేట్ కన్స్యూమర్ డిస్పోజల్ రిడ్రెసల్ కమిషన్(SCDRC)లో గత మూడేళ్లలో వినియోగదారుల న్యాయస్థానాల్లో 2,200 కేసులు నమోదయ్యాయన్నది వాస్తవమా అని ప్రశ్నించారు. కేసుల్లో సత్వర పరిష్కారానికి ప్రభుత్వంతీసుకున్న చర్యలు తెలియజేయాలని కోరారు.ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలకు కేంద్ర వినియో గదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ శాఖ సహాయ మంత్రి బి.ఎల్ వర్మలిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. గత మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్(SCDRC)లో2,260 కేసులు నమోదయ్యాయన్నారు. గత మూడేళ్లలో మొత్తం 1686 కేసులు పరిష్కరించబడ్డాయని వివరించారు.విని యోగదారుల వ్యవహారాల విభాగం వినియోగదారుల రక్షణ, సాధికారత కోసం నిరంతరం కృషిచేస్తోందని కేంద్ర సహాయమంత్రి వివరించారు. ప్రపంచీకరణ, సాంకేతికత, ఇకామర్స్ మార్కెట్లు మొదలైన కొత్త యుగంలో వినియోగదారుల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇచ్చే ఉద్దేశంతో వినియోగదారుల రక్షణ చట్టం, 1986 స్థానంలో వినియోగదారుల రక్షణ చట్టం2019 రూపొందించ బడిందన్నారు. వినియోగదారుల కేసుల పరిష్కారంలో వేగం పెంచేందుకు CONFONET పథకం కింద,జాతీయ వినియోగదారుల వివాదాలపరిష్కార కమిషన్ (NCDRC) 10 బెంచులు, ఆంధ్రప్రదేశ్ SCDRC సహా రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ల(SCDRCలు) 35 బెంచుల్లో వీడియో కాన్ఫరెన్స్ పరికరాలు సమకూర్చా మన్నారు. అ లాగే వినియోగదారుల కమిషన్లలో ఉన్న ఖాళీలను త్వరితగతిన భర్తీ చేయడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంతరం కృషి చేస్తు న్నాయని వివరించారు.